దళితుల కోసం మీరేం చేశారు?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

- సంస్కార హీనుడు కవ్వంపల్లి.. దళిత వ్యతిరేకి ఆరెపల్లి
- ఎమ్మెల్యే రసమయితోనే మానకొండూర్ నియోజకవర్గం అభివృద్ధి
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ దళిత నాయకులు

తిమ్మాపూర్, అక్టోబర్ 19: దళితుల కోసం మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ ఏం చేశారని.. బీఆర్ఎస్ దళిత నాయకులు ప్రశ్నించారు. దళితోద్ధరకుడు రసమయి బాలకిషన్‌ను వేలెత్తి చూపే అర్హత వారికి లేదన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు బోయిని కొమురయ్య మాట్లాడుతూ, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఎస్సీ నియోజకవర్గమైన మానకొండూర్‌ను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఆయనను విమర్శించే నాయకులు.. నియోజకవర్గం, మండలానికి ఏం చేశారని ప్రశ్నించారు. నమస్కారానికి ప్రతి నమస్కారం చేయడం సంస్కారమని తెలియదా? అని కవ్వంపల్లిని ప్రశ్నించారు. సంస్కార హీనుడైన కవ్వంపల్లి రసమయిని దూషించడం సిగ్గుచేటని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ దళిత వ్యతిరేకిగా నియోజకవర్గంలో పేరు పొందారని, తాను ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లు ఏ ఒక్క దళిత కుటుంబాన్ని బాగుచేసింది లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతి సమావేశంలో స్థానికత విషయాన్ని వారు ప్రస్తావిస్తున్నారని.. ప్రజలు ఎన్నికల్లో రెండుసార్లు గెలిపించిన రసమయి స్థానికుడా.. లేక ఒకసారి గెలిచిన ఆరెపల్లి, గెలుపంటే తెలియని కవ్వంపల్లి స్థానికులా? అని ప్రశ్నించారు. అహంకారం ఉన్నవాడు ఎక్కడా గెలిచిన దాఖలాలు లేవని, కవ్వంపల్లి పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. మాల మహానాడు రాష్ట్ర నాయకుడు, మన్నెంపల్లి సర్పంచ్ మేడి అంజయ్య మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిన వ్యక్తి రసమయి అని, అలాంటి వ్యక్తిపై మరోసారి దూషణకు దిగితే గ్రామాల్లో తిరగనియ్యమని హెచ్చరించారు. దళితులంతా ఏకమై ఆరెపల్లి మోహన్‌ను జడ్పీటీసీగా ఎన్నుకొని, జడ్పీ చైర్‌పర్సన్‌గా చేస్తే మండలానికి ఆయన చేసింది ఏముందని ప్రశ్నించారు. ఒకసారి తిమ్మాపూర్ జడ్పీటీసీగా చేసిన కవ్వంపల్లి సత్యనారాయణ ఏం చేశారో చెప్పాలన్నారు. ఆయన హైదరాబాద్ వెళ్లి డాక్టర్‌గా ప్రాక్టీస్ చేసుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. మానకొండూర్ ప్రజలను మోసం చేస్తున్న కవ్వంపల్లి, ఆరెపల్లికి పోటీ చేసే అర్హత లేదన్నారు. సమావేశంలో నాయకులు వంతడుపుల సంపత్, పారునంది జలపతి, మాతంగి లక్ష్మణ్, బోయిని తిరుపతి, సంగుపట్ల మల్లేశం, ఆసోద శ్రీనివాస్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆముదాలపల్లిలో సీఎస్ఎస్ అధికారుల ఫీల్డ్ స్టడీ

ఆముదాలపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో గ్రామ మ్యాప్ డ్రాయింగ్‌ను పరిశీలిస్తున్న సీఎస్ఎస్ శిక్షణ అధికారులు

శంకరపట్నం, అక్టోబర్ 19: సెంట్రల్ సెక్రటరీ సర్వీసెస్ అధికారుల బృందం శిక్షణలో భాగంగా మండలంలోని ఆముదాలపల్లి గ్రామాన్ని సందర్శించింది. సుమిత్ గుగ్త్యాల్, అజిత్ యాదవ్, సుమిత్ కుమార్, తపేష్ కుమార్ కన్సోలియా, విశాల్ విమల్‌తో కూడిన సీఎస్ఎస్ ట్రైనీ అధికారుల బృందం కేంద్ర, రాష్ట్ర పథకాల స్టడీ టూర్‌లో భాగంగా గురువారం గ్రామానికి చేరుకున్నది. హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్‌లో ఐదు రోజుల శిక్షణ పొందుతున్న వారు తెలంగాణలో ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరును స్టడీ చేశారు. క్షేత్రస్థాయి పరిశీలనలో ఈజీఎస్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారుల బృందం నర్సరీ పెంపకం, పల్లె ప్రకృతివనం, సెగ్రిగేషన్ షెడ్డు, తదితరాలను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులు, గర్భిణులకు అందించే పోషకాహారం, తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ముగ్గు రూపంలో వేసిన గ్రామ మ్యాప్‌ను పరిశీలించారు. ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా ఉన్నతాధికారులకు రికార్డులను సబ్మిట్ చేయనున్నట్లు బృంద సభ్యులు వెల్లడించారు. ఇక్కడ ఎంపీడీవో శ్రీవాణి, ఏపీవో శారద, సర్పంచ్ బత్తుల మానస, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు ఉన్నారు.

రేణికుంటలో ట్రైనీ ఐఏఎస్ అధికారుల పర్యటన

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 19: మండలంలోని రేణికుంట గ్రామంలో ట్రైనీ ఐఏఎస్ అధికారులు గురువారం పర్యటించారు. రైతు వేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో షబానా రైతుబంధు, రైతు బీమా, పంట రుణమాఫీ పథకాల గురించి అధికారులకు వివరించారు. అనంతరం ట్రైనీ ఐఏఎస్‌లు ఆయిల్‌పామ్ తోటలను సందర్శించారు. రైతులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

తిమ్మాపూర్, అక్టోబర్19: ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు పాటించాలని తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి సూచించారు. గురువారం తిమ్మాపూర్ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ పరిధిలోని తిమ్మాపూర్, చిగురుమామిడి, గన్నేరువరం మండలాల నాయకులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలు ఇతర కార్యక్రమాల కోసం తప్పకుండా సంబంధిత అధికారులను సంప్రదించి పర్మిషన్ తీసుకోవాలన్నారు. ఇతర పార్టీల వారిని కించపరిచేలా మనోభావాలు దెబ్బతీసేలా నేరుగా, సామాజిక మాధ్యమాల్లో కూడా విమర్శించవద్దన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ప్రమోద్ రెడ్డి, రాజేశ్, నరసింహారావు, సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన రెడ్డి సంఘం కార్యవర్గం

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 19: మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రెడ్డి కులస్తులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహ రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు ఇనుకొండ జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా దేవసాని తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఇనుకొండ నరసింహా రెడ్డి, చింతకుంట వెంకట్ రెడ్డి, ప్రధానకార్యదర్శిగా రాంచంద్రారెడ్డి , ప్రచారకార్యదర్శిగా ఇనుకొండ మాధవ రెడ్డి, కోశాధికారిగా జనార్దన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా కొమ్మర శ్రీనివాస్ రెడ్డి, సోమిరెడ్డి మనోహర్ రెడ్డి, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. తమ ఎన్నికకు సహకరించిన రెడ్డి సంఘ నాయకులు, సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండ గోపాల్ రెడ్డి, తిమ్మాపూర్ వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, రామ కృష్ణ కాలనీ గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడు దావు సంపత్ రెడ్డి, రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

44 మంది బైండోవర్

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 19: మండలంలోని ఊటూర్, అన్నారం, కొండపల్కల, చెంజర్ల, ముంజంపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 33 మందిని గురువారం తహసీల్దార్ సీహెచ్ రాజు ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఎవరూ ఉల్లంఘించవద్దన్నారు.

వీణవంక, అక్టోబర్ 19: ఎన్నికల నేపథ్యంలో మండలానికి చెందిన 11 మందిని గురువారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ తిరుమల్‌రావు ఎదుట హాజరుపరిచినట్లు ఎస్ఐ ఆసిఫ్ తెలిపారు. ఇందులో పాత కేసుల్లో నిందితులు, హిస్టరీ షీటర్లు ఉన్నారని పేర్కొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు

చిగురుమామిడి కట్టకు పిచ్చి మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

చిగురుమామిడి, అక్టోబర్ 19: సద్దుల బతుకమ్మ, దసరా పండుగలు పురస్కరించుకొని గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, చెరువు కట్టల వద్ద పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఆయా చోట్ల పిచ్చి మొక్కలను తొలగించారు. బతుకమ్మ ఆడేందుకు నేలను చదును చేయించారు. చెరువు కట్టల వద్ద నిమజ్జన ప్రదేశాల్లో విదుయత్ లైటుల చేశారు. ఏర్పాట్లను సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు.

ఉచిత శిక్షణ ఇచ్చిన కోచ్‌కు సన్మానం



పీడీ రాజిరెడ్డిని సన్మానిస్తున్న ఆర్మీ ఉద్యోగం సాధించిన యువకులు

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 19: ఇటీవల ఖమ్మంలో జరిగిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొని ఉద్యోగం సాధించిన హుజూరాబాద్‌కు చెందిన కన్నెబోయిన సృజన్ కుమార్, గూళ్ల భరత్ తమకు ఉచిత శిక్షణ ఇచ్చిన కోచ్ కొన్ని రాజిరెడ్డిని గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సైనికులుగా ఎంపికైన యువకులు మాట్లాడుతూ, అథ్లెటిక్స్ ఇతర అంశాల్లో పీడీ రాజిరెడ్డి ఇచ్చిన శిక్షణ ఉద్యోగ సాధనలో తమకు ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు.

నెలాఖరులోగా పన్నుల వసూలు పూర్తి చేయాలి

• జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య • రేకొండలో పర్యటన

రేకొండలో సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న డీపీవో వీరబుచ్చయ్య తదితరులు

చిగురుమామిడి, అక్టోబర్ 19: గ్రామపంచాయతీల్లో పన్నుల వసూలును ఈ నెల 31లోగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) వీర బుచ్చయ్య పంచాయతీ అధికారులను ఆదేశించారు. మండలంలోని రేకొండ గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పన్నుల వసూలు వేగవంతం చేయాలన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేపట్టాలని, చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంప్ యార్డ్‌కు తరలించాలన్నారు. గ్రామాలోల అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాక్టర్ ఈఎంఐలు సకాలంలో చెల్లించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో నర్సయ్య, మండల పరిషత్ సూపరింటెండెంట్ ఖాజా మొయినొద్దీన్, ఎంపీవో శ్రావణ్ కుమార్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత నిజాయితీగూడెం జట్టు

విజేతలకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 19: మానకొండూర్ మండలం చెంజర్ల రెవెన్యూ గ్రామాల పరిధిలో బతుకమ్మ–దసరా పండుగను పురస్కరించుకొని చెంజర్ల ఎంపీటీసీ గడ్డి రేణుక–గణేశ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో చెంజర్ల, నిజాయితీగూడెం, పెద్దార్‌పల్లి, ఖాదరగూడెం గ్రామాల నుంచి 8 జట్లు పాల్గొన్నాయి. గురువారం ఫైనల్ మ్యాచ్‌లో నిజాయితీగూడెం జట్టుగెలుపొందగా, ఖాదరగూడెం జట్టు రన్నరప్‌గా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయా జట్లకు జడ్పీటీసీ, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ బహుమతులను అందజేశారు. క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి, క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. అనంతరం జడ్పీటీసీని ఎంపీటీసీలు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వరుకోలు రాకేశ్, కడారి ప్రభాకర్, శామంతుల శ్రీనివాస్, బొమ్మెన మధు, పొన్నాల శేఖర్, గొల్లెన కుమార్, సంపత్, ప్రకాశ్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.